సాక్షి
వికారాబాద్
గురువారం ‌। 8 ‌। ఆగస్టు ‌। 2024





**పచ్చిరొట్ట సాగు..**
పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరిగి అధిక దిగుబడులకు దోహదపడుతుందని ఏఓ జయశంకర్ తెలిపారు. 8లో▸



**డాక్టర్లు లేక.. వైద్యం అందక**
దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రోగులకు వైద్యం అందడం లేదు. 8లో▸



**బడులకు నో కరెంట్ బిల్**
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోంది. 9లో▸

## న్యూస్‌రీల్

### దరఖాస్తు గడువు పొడిగింపు



**అనంతగిరి:** ఇంటింటా ఇన్నోవేటర్ – 2024 కార్యక్రమం కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. గృహిణుల నుంచి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, రైతులు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకోసం వాట్సాప్ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

### పోలీస్ ఉద్యోగం మన అదృష్టం
డీటీసీ ఏఎస్పీ మురళీధర్



మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీధర్

**అనంతగిరి:** పోలీసు ఉద్యోగం చేయడం మన అదృష్టమని డీటీసీ ఏఎస్పీ మురళీధర్ అన్నారు. వికారాబాద్‌లోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న అభ్యర్థుల్లో గ్రే హౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో పని చేయడానికి సుముఖంగా ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రేహౌండ్స్ ఏఎస్పీ వెంకటేశ్వర్లు, ఆక్టోపస్ ఆర్ఎస్ఐ మహేష్ శిక్షణ కానిస్టేబుళ్లకు పోలీసు విధులపై అవగాహన కల్పించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం పరీక్ష నిర్వహించనున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

### ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.1.11లక్షల విరాళం

**నందిగామ:** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగోనిగూడ శివారులో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభానికి బుధవారం ఆయన రూ. 1.11 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తమ సంపాదనలో కొంత సేవాకార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల జగన్ యాదవ్, ఆంజనేయులు, బాలరాజు, వెంకట్ రెడ్డి,సుధాకర్, యాదయ్య, శ్రీకాంత్, నరేశ్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.


### మేకగూడను సందర్శించిన యూపీ బ్యాంక్ మేనేజర్లు

**నందిగామ:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 35 మంది బ్యాంకు మేనేజర్ల బృందం బుధవారం మండల పరిధిలోని మేకగూడను సందర్శించింది. వీరు మహిళా సంఘాల పనితీరును పరిశీలించేందుకు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా, గ్రామ సంఘాలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు ఏవిధంగా వినియోగించుకుంటున్నారు. తిరిగి రుణాలు ఎలా చెల్లిస్తున్నారనే విషయాలను ఆ సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి పొందే తీరును తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎల్ఎం కో ఆర్డినేటర్ అభిషేక్, డీపీఎం స్వర్ణలత, ఏపీఎం యాదగిరి, సీసీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఆయకట్టు 200 ఎకరాలు | సాగు 20 ఎకరాలే

## నిండుకుండలా పెద్దేముల్ పెద్ద చెరువు

- ఆయకట్టుకు అందని నీరు
- కాల్వలు ధ్వంసం కావడంతోనే ఈ పరిస్థితి
- మరమ్మతుల ఊసే ఎత్తని అధికార యంత్రాంగం
- ఇబ్బందుల్లో అన్నదాతలు



నీటితో కళకళలాడుతున్న పెద్దేముల్ పెద్ద చెరువు

**పెద్దేముల్:** పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంలా తయారైంది పెద్దేముల్ పెద్ద చెరువు పరిస్థితి. ఈ చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు ఉన్నా కేవలం 20 ఎకరాలకే సాగు నీరు అందుతోంది. చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా కాలువలు పూర్తిగా పూడిపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. ఒకప్పుడు వరి పంటలతో కళకళలాడిన పొలాలు నేడు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. మండల రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చెరువులు బాగుపడతాయని రైతులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. కానీ వాటి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని మండలంలోని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారిన తమ బతుకులు మారడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. కాలువలకు మరమ్మతులు చేయా లని పెద్దేముల్, తింసాన్‌పల్లి, బుద్దారంతోపాటు మరి కొన్ని గ్రామాల రైతులు ప్రభుత్వాలను కోరుతున్నా నిధులు మంజూరు కావడం లేదు.

**వృథాగా సాగునీరు**

ఏటా పెద్ద చెరువు నిండి నీరు వృథా పోతోంది. తూములు, కాలువలు దెబ్బతిన్నా మరమ్మతులు చేయించడం లేదు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా పెద్దేముల్ పెద్ద చెరువు అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేసింది. ఈ నిధులతో పూడికతీత, అలుగు, కట్ట మరమ్మతు చేశారు. కానీ కాలువల్లో పూడిక తీత, ఇతర మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో వెచ్చించిన మొత్తం వృథాగా మారింది. ఏటా చెరువు నిండుగా ఉన్నా ఆయకట్టుకు మాత్రం నీరు చేరడం లేదు.

**కాలువలు కబ్జా**

పెద్ద చెరువు కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. దీంతో కాలువల రూపురేఖలు లేకుండా పోతున్నాయి. ఈ విషయం ఇరిగేషన్ ఉన్నతాధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కాలువలు కంప చెట్లతో నిండిపోయాయి.

### నిధులు మంజూరు చేయాలి



చెరువు మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. కాలువలు దెబ్బ తినడంతో ఆయకట్టు బీడుగా మారింది. ఈ సమస్య పదేళ్ల నుంచి ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు నీరందేలా చూడాలి.

– బాలప్ప, మాజీ సర్పంచ్, పెద్దేముల్

### వర్షాధార పంటలు వేస్తున్నాం



గతంలో చెరువు నీటి ఆధారంగా వరి పంట వేసేవాడిని. ప్రస్తుతం నీరు రాక భూమి బీడుగా మారింది. విధిలేని పరిస్థితిలో వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజురు చేయాలి. లేకుంటే చెరువులో నీరు ఉన్నా ప్రయోజనం ఉండదు.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, పెద్దేముల్

### ప్రతిపాదనలు సిద్ధం



పెద్దేముల్ పెద్ద చెరువు కాలువలు అధ్వాన స్థితికి చేరిన విషయం వాస్తవం. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు పలు మార్లు మా దృష్టికి తెచ్చారు. ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కింద కాలువల్లో ముళ్లపొదలను తొలగిస్తాం.

– నవీన్, ఇరిగేషన్ ఏఈ, పెద్దేముల్



వికారాబాద్ 23వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## పార్కులను అభివృద్ధి చేయండి

**అనంతగిరి:** మున్సిపల్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. బుధవారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని 14, 23, 24వ వార్డుల్లో పర్యటించారు. పార్కుల అభివృద్ధి తోపాటు వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌ను ఆదేశించారు. యోగా బెడ్స్ తోపాటు పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు సమకూర్చాలన్నారు. స్వచ్ఛధనం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేసి వార్డుల వారీగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ నెల 9న పార్కుల్లో పెద్ద మొత్తంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 24వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలామృతం, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ తర్వాత మేకలగండిలోని డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రి య ఎరువుల తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు ప్రభావతి, రామస్వామి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

**వసతి గృహాలు శుభ్రంగా ఉండాలి**

**పరిగి:** ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం పరిగి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి పగుళ్లు ఉండటంతో వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం పట్టణంలో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్కులను అభివృద్ధి చేసి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ వెంచర్లలో కూడా పార్కుల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

**అనంతగిరి:** జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లాస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో డయాస్, అతిథులు కూర్చునేందుకు సదుపాయం, తాగునీటి వసతి, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణమంతా శుభ్రంగా ఉండాలన్నారు. రోడ్ల పక్కన ముళ్లపొదలను తొలగించాలని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథులందరికీ ఆహ్వానాలు పంపాలని చెప్పారు. అధికారులకు అప్పగించిన పనులను పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు రుణమాఫీ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఏఓ ఫర్గీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుష్పన్‌కుమార్

## డ్రగ్స్ రహిత సమాజానికి కృషిచేద్దాం

టీజీఏఎన్‌బీ డీఎస్పీ పుష్పన్‌కుమార్

**అనంతగిరి:** మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని టీజీఏఎన్‌బీ(తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) డీఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాలలో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను స్నేహితులు, బంధువులకు వివరించాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించినా.. విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యావంతులే ఎక్కువగా సైబర్ మోసాల బారిన పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 హెల్ప్ లైన్‌కి కాల్ చేయాలన్నారు. అత్యాశకు వెళ్లి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మందారికా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తత అవసరం

రంగారెడ్డి జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

**నందిగామ:** వర్షాలు, వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన నందిగామలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుమతికి చెప్పారు. బాలింతలకు అందుతున్న పౌష్టిక ఆహారం గురించి అంగన్‌వాడీ టీచర్లను అడిడి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, కిశోర బాలికల బరువును ఎప్పటిప్పుడు పరిశీలించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్ఎంలు రజిత, స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మీ, కమల, సుజాత, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛదనం–పచ్చదనం పరిశీలన**

**కేశంపేట:** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించేందుకు జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి బుధవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. గ్రామంలోని నర్సరీ, కంపోస్టు ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వన మహోత్సవంలో పాల్గొని మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్ర కుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శిరీష, ఏపీఓ అజీజ్, పంచాయతీ కార్యదర్శి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ టు హాస్పిటల్

- సీజనల్ వ్యాధుల బారిన వసతి గృహ విద్యార్థులు
- తరచూ ఆస్పత్రుల పాలవుతున్న చిన్నారులు
- పారిశుద్ధ్యం లోపించడం, నాణ్యమైన భోజనం లేకపోవడంతోనే..
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



ఇటీవల జ్వరం బారిన పడి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన బూర్గుపల్లి హాస్టల్ విద్యార్థులు

**వికారాబాద్:** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు అధ్వానంగా తయారయ్యాయి. హాస్టళ్లలో పరిస్థితులు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారం, పది రోజుల్లో ఏదో ఒక హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల నస్కల్ కేజీబీవీలో 26మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా తాజాగా మరో రెండు వసతి గృహాల్లో అదే పరిస్థితి తలెత్తింది. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి బాలుర వసతి గృహంలో విద్యార్థులు కళ్ల పసకలతో ఆస్పత్రిలో చేరగా.. బూర్గుపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు విషజ్వరాల బారిన పడి ఆస్పత్రిలో చేరారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆస్పత్రిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

**ఫిర్యాదు చేసినా..**

వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. సన్న బియ్యంతో అన్నం, రకరకాల కూరగాయలతో పౌష్టికాహారంతో కూడిన భోజనం పెడుతున్నామని పాలకులు చెబుతున్నా వాస్తవంలో అది ఎక్కడా కనిపించడం లేదు. మెనూ మాత్రమే కలర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ఏ హాస్టల్‌లో కూడా మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదు. చాలా హాస్టళ్లలో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం కావడం లేదు. గతంలో చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల వసతి గృహ విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ 10కిలో మీటర్ల దూరంలోని తహసీల్దార్ కార్యాలయం వచ్చి ఆందోళన చేశారు. మంచి భోజనం పెట్టమని అడిగితే వార్డెన్ దుర్భాషలాడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఇటీవల కుల్కచర్ల మండలంలోని ఓ హాస్టల్‌లో పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నెల రోజుల క్రితం నస్కల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో 26 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కొత్తగడి వసతి గృహం విద్యార్థులు కూడా ఆస్పత్రుల పాలయ్యారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. హాస్టళ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు నెలకోసారి కూడా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు.

**జిల్లాలో వందకు పైగా హాస్టళ్లు**

జిల్లాలో సోషల్ వెల్ఫేర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, స్త్రీ శిశు సంక్షేమం, గురుకుల, కేజీబీవీ ఇలా ఆయా కేటగిరీలకు చెందిన హాస్టళ్లు వందకు పైగా ఉన్నాయి. వీటిలో దాదాపు 16వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లు కలిపి ఒక్కో శాఖలో 20 నుంచి 25వరకు ఉన్నాయి. ఈ శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు కూడా ఉన్నారు. అయితే మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉద్యోగ విరమణ పొందగా ఆ బాధ్యతలు యువజన విభాగం మరియు క్రీడల శాఖ జిల్లా అధికారికి అప్పగించారు. ఇక గురుకులాలను పర్యవేక్షించే ఆర్‌సీఓలు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడం తప్ప వారికి సమస్యలు పట్టడం లేదు. సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థులు ధర్నాలు, ఆందోళన బాట పడుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదు. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా నెలల తరబడి కాలయాపన చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వార్డెన్ల నుంచి మామూళ్లకు అలవాటు పడిన అధికారులు పర్యవేక్షణను గాలికొదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# చేనేతకు పునర్వైభవం

- ఆమనగల్లులో చేనేత సంఘం భవన నిర్మాణానికి నిధులు
- జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ శశాంక

**ఆమనగల్లు:** ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో చేనేత రంగానికి రాష్ట్రంలో పునర్వైభవం తీసుకువస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెలకట్టలేని నైపుణ్యం, సృజనాత్మకతకు చేనేత అద్దం పడుతోందన్నారు. అద్భుతమైన చేనేత కళను ప్రపంచానికి అందించిన ఘనత నేత కార్మికులదే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగంతో పాటుగా చేనేత రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికులకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాల పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. వీరి పెట్టుబడులకు అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటుగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. పట్టణంలో నేత సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు దూరం చేస్తామన్నారు. అభివృద్ధి పనులకు పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

**పాఠశాలల అభివృద్ధికి సహకరించండి**

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు, దాతల సహకారం అవసరమని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఆకుతోటపల్లి, కోనాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆకుతోటపల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన కోనాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంట గది, టాయిలెట్స్‌ను పరిశీలించారు. పాఠశాలలో 31 మంది మాత్రమే ఉండడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్స్‌కు సున్నం వేయించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కోనాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, ఆస్పత్రి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు విన్నవించారు.



చేనేత కార్మికురాలు యాదమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ శశాంక

**ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు: కలెక్టర్**

చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయని కలెక్టర్ శశాంక చెప్పారు. 1905 ఆగస్టు 7న జరిగిన స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన రోజును జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకొంటున్నామని కలెక్టర్ చెప్పారు. అర్హులైన చేనేత కార్మి కులకు రుణాలు, ఫించన్లు మంజూరు చేస్తామన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతీ సోమవారం ప్రభుత్వాధికారులు విధిగా చేనేత వస్త్రాలను ధరిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు పున్న సత్యనారాయణ, పురుషోత్తం, చంద్రశేఖర్, వనం యాదమ్మలను ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించారు.

## క్లుప్తంగా

### పంట వివరాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



బడేంపల్లిలో పంటను పరిశీలిస్తున్న గోపాల్

**దోమ:** రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కిష్టాపూర్, బడేంపల్లి గ్రామాలలో పరిగి వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మీకుమారితో కలసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు వానకాలంలో సాగు చేసిన పంటలను వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో కాపాడుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలపై చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారుల సూచనలతో మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి, దాదాపూర్ రైతు వేదికలను సందర్శించారు. అక్కడ ఉన్న రైతులతో ముచ్చటించి పంటల సాగు వివరాలను తెలుసుకున్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ చెన్నయ్య, బాబ్యా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### మైనర్ డ్రైవింగ్.. బైకుల ధ్వంసం

**తాండూరు టౌన్:** అతివేగంగా కారు నడిపిన ఓ బాలుడు మూడు బైకులను ఢీకొట్టాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సాయిపూర్ ప్రాంతంలోని ఓ ఇంటి ముందు పార్క్ చేసిన మూడు బైకులను అతి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టి విధ్వంసం సృష్టించింది. బైకు యజమాని మోయిద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కారును గుర్తించారు. మంగళవారం రాత్రి స్నేహితుడి ఇంట్లో నిద్రపోయిన ముగ్గురు బాలురు కారులో ఇంటికి వెళ్తున్నారు. ఓ బాలుడు కారు నడుపుతుండగా మిగతా ఇద్దరు కారులోనే ఉన్నారు. అతి వేగంగా కారు నడిపిన బాలుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే కారు యజమానిని గుర్తించి అతనిపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు. అదే సమయంలో పక్క గల్లీ నుంచి ఓ బాలుడు సైకిల్‌పై వస్తూ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మైనర్లకు కారు, బైకులు ఇవ్వరాదని, అలాంటి వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### గుండెపోటుతో బిల్‌కలెక్టర్ మృతి

**షాబాద్/షహాదీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్ యంజాల జంగయ్య(55) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఉదయం 8 గంటల వరకు చలాకీగా ఉన్న ఆయన అనంతరం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డి, తోటి కార్మికులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం నగదును అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలతో పాటు ఒక కుమారుడు ఉన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

**షాబాద్:** యువతి అదృశ్యమైన సంఘటన మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారుగల్ల మల్లేశ్ చిన్న కూతురు అక్షయ(18) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. మధ్యరాత్రి కుటుంబీకులు లేచి చూసే సరికి పడుకున్న చోట అక్షయ కనిపించ లేదు. దీంతో యువతి కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నానాజీపురం గ్రామానికి చెందిన సందీప్ అనే యువకుడిపై తమకు అనుమానం ఉందని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# లీజు పూర్తయినా.. టెండర్లు నిర్వహించరా?



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

- నాలుగు నెలల క్రితం ముగిసిన దుకాణ సముదాయాల లీజు
- పరిగి మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- పాత లబ్ధిదారులకే కొనసాగిస్తున్న అధికారులు
- రాజకీయ నాయకుల జోక్యంతో టెండర్ల ప్రక్రియ ఆలస్యం

**పరిగి:** దుకాణ సముదాయాల లీజు ముగిసినా యథావిధంగా వాటిని కొనసాగిస్తూ పరిగి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. దుకాణాల టెండర్ల ప్రక్రియ ఆలస్యంపై స్థానికులు బహిరంగగా విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీకి ఆదాయాన్ని తెచ్చిపెట్టే దుకాణాల సముదాయానికి టెండర్లు వేసి అప్పజెప్పాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ నిర్లక్ష్యం వెనుక కారణం ఏంటని ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. గతంలో టెండర్లలో సొంతం చేసుకున్న వారి లీజు పూర్తయినా ఏవిధంగా కొనసాగిస్తున్నారని అధికారులపై మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా టెండర్ ప్రక్రియపై అధికారులు నోరుమెదపడం లేదు.

**మున్సిపాలిటీకి 27 దుకాణాలు**

పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీకి 27 దుకాణాలున్నాయి. వాటి లీజు ఏప్రిల్‌లో పూర్తయినా టెండర్ల ప్రక్రియపై అధికారులు అలసత్వం వ్యవహరిస్తున్నారు. రీ టెండర్లు వేయాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి పాతవారికి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రజాసంఘాల నాయకులు టెండర్లు వేయాలని అధికారులను కోరినా ప్రయోజనం లేదు. పాత దుకాణ టెండర్‌దారులతో అధికారులు కొంత డబ్బులు తీసుకుని ఆలస్యం చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. టెండర్ల ప్రక్రియను వెంటనే జనాభా దామాషా రిజర్వేషన్‌ల ప్రకారం నిర్వహించాలని సీపీఎం, సీపీఐ తదితర ప్రజాసంఘాల నాయకులు వినతులు అందజేస్తున్నారు.

**అధికార పార్టీ ఒత్తిళ్లు!**

అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతోనే టెండర్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుకాణదారులు టెండర్లు నిర్వహించరాదని అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులతో పైరవీలు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులకు కొంత మొత్తంలో డబ్బులు ఆశ చూపి టెండర్ల ప్రక్రియ లేకుండా యాథావిధిగా కొనసాగాలని పైరవీలు చేయించినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరిణామాలతో మున్సిపాలిటీకి వచ్చే ఆదాయంపై భారీ దెబ్బ పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం**

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దుకాణాల టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు బుధవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ పరిధిలోని 27 దుకాణాలకు లీజు పూర్తయి దాదాపుగా 4 నెలలు గడుస్తుందన్నారు. అయిన అధికారులు టెండర్ ప్రక్రియను ఎందుకు నిర్వహించడంలేదని అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. కొంత మంది ప్రజాప్రతినిధులు టెండర్ ప్రక్రియ జరగకుండా పైరవీలు కొనసాగుతున్నాయన్నారు. టెండర్లను జనాభా దామాషా ప్రకారం అందరికీ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, నాయకుడు చంద్రయ్య తదితరులు ఉన్నారు.

**టెండర్లు నిర్వహించాలి**



మున్సిపల్ అద్దె సెంటర్ల లీజు గడువు ముగిసి నాలుగు నెలలు అవుతున్నా అధికారులు ఎందుకు టెండర్ల వేయడం లేదు. జనాభా దామాషా ప్రకారం టెండర్ల ప్రక్రియను కొనసాగించి అన్ని వర్గాలకు న్యాయం చేయాలి. అధికార పార్టీకి కొమ్ము కాయకుండా వెంటనే టెండర్లను నిర్వహించాలి.

– మల్లేశ్, ప్రజా సంఘాల నాయకుడు, పరిగి

# పచ్చిరొట్ట సాగు.. లాభాలు బాగు



మోమిన్‌పేటలో సాగులో ఉన్న జనుము

- ప్రధాన పంటకు ముందు నాటితే ప్రయోజనం
- మండల వ్యవసాయాధికారి జయశంకర్



**మోమిన్‌పేట:** పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరిగి అధిక దిగుబడులకు దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి జయశంకర్ పేర్కొన్నారు. వీటి ఉపయోగంతో రసాయన ఎరువులను తగ్గించడం, తెగుళ్లు, తదితర చీడపీడలు పంటలకు సోకకపోవడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతుకు ఆదాయం వస్తుందన్నారు. సాధారణ పంటల సాగు కన్న పచ్చిరొట్ట ఎరువులతో సాగు చేసిన పంటలు అధిక దిగుబడులు వస్తాయన్నారు. రసాయన ఎరువుల వాడటంతో భూసారం తగ్గి ఖనిజాలు, పోషకాలు నింపేందుకు ఎక్కువ మొత్తంలో రైతు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువుల సాగుపై ఏఓ సూచనలు చేశారు.

**పచ్చిరొట్టలో రకాలు**

పచ్చిరొట్ట ఎరువులను ఇచ్చే పంటలు నాలుగు రకాలుగా ఉన్నాయి. జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర, అలసందలు పోషకాలను పుష్కలంగా ఇస్తాయి.

**ఎప్పుడు విత్తుకోవాలి**

పచ్చిరొట్ట ఎరువుల నిచ్చే పంటలను జూన్ మొదటి వారంలో విత్తుకోవాలి. ఎకరాకు జీలుగ 15 నుంచి 20 కిలోలు, జనుము 20 నుంచి 25 కిలోలను విత్తుకోవాలి. పిల్లిపెసర, బయాంచ విత్తనాలు అందుబాటులో లేవు.

**ఎప్పుడు దున్నుకోవాలి**

విత్తిన 40 రోజుల నుంచి 45 రోజులు పైబడగానే భూమిలో కలియ దున్నుకోవాలి. పూత దశకు రావడం, కింది వేర్లకు బుడిపెలు వచ్చే సమయంలో దున్నుకోవడం రైతులకు ఎంతో మేలు. కింద వేర్లకు బుడిపెలు రావడంతో నత్రజని భూమిలోనే నిల్వ ఉంటుంది. ఎకరాకు 10 నుంచి 12 టన్నుల సేంద్రియ ఎరువు అందుబాటులోకి వస్తుంది. భూమిలో రెండుసార్లు కలియ దున్ని పూర్తిగా భూమిలో మాగిన తర్వాత రెండో పంటను సాగు చేసుకోవాలి. సాంకేతిక పరికరాలైన ట్రాక్టరు రోటోవేటరు, ఎద్దుల నాగళ్లతోగాని కలియ దున్నుకోవాలి. ప్రస్తుతం దున్నే దశలో పచ్చిరొట్ట పంటలున్నాయి.

# న్యాయవాదుల విధుల బహిష్కరణ



పరిగి: నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

- జనగామ ఘటనపై మండిపడిన అడ్వకేట్లు
- దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్

**అనంతగిరి:** న్యాయవాద దంపతులపై పోలీసుల దాడికి నిరసనగా జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం వికారాబాద్ కోర్టు నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. కేసు విషయంలో అమృతరావు, కవిత దంపతులు మాట్లాడేందుకు పీఎస్‌కు వెళ్లగా పోలీసులు అకారణంగా కొట్టారన్నారు. కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, సయ్యద్ ఖయాం, గోవర్ధన్‌రెడ్డి, లవకుమార్, కమాల్‌రెడ్డి, ఆనంద్, రఫీ, జనార్దన్‌రెడ్డి, రాజు, శంకరయ్య, శ్రీనివాస్‌రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన**

**పరిగి:** న్యాయవాదులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడికి నిరసనగా బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన క్లయింట్ కేసు విషయంలో స్థానిక సీఐని కలవడానికి వెళ్లిన అడ్వకేట్లు అమృతరావు, కవితపై పోలీసు సిబ్బంది చేయి చేసుకోవడం ఏమిటని మండిపడ్డారు. దాడికి పాల్పడిన సీఐ, ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో నిత్యం ఏదోఒక చోట న్యాయవాదులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భక్తకుమార్, న్యాయవాదులు లింగం, నరేందర్, ఆనంద్‌గౌడ్, బాలముకుందం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




తాండూరు టౌన్: కోర్టు ఎదుట నిరసన చేస్తున్న అడ్వకేట్లు

**దాడులు దారుణం..**

**కొడంగల్ రూరల్:** సమాజంలో న్యాయాన్ని రక్షించేందుకు కృషిచేస్తున్న అడ్వకేట్లపై పోలీసులు దాడులకు పాల్పడటం దారుణమని బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మండిపడ్డారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు బి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బాగ్యలత, సీనియర్ న్యాయవాదులు పి.వెంకట్‌రెడ్డి, ఏవి.ఆనంద్, పి.సుధాకర్‌రెడ్డి, టి.కరుణాకర్‌రెడ్డి, బస్వరాజు, మురళీమోహన్ నామాజీ, వెంకటయ్య, బి.శకనప్ప, కె.రాములు, జూనియర్ న్యాయవాదులు బి.కృష్ణయ్య, కె.రమేష్, పి.భానుప్రకాష్, రవీందర్‌నాయక్, మోహిద్ తదితరులు పాల్గొన్నారు.

**దాడి అమానుషం..**

**తాండూరు టౌన్:** న్యాయవాద దంపతులపై పోలీసుల దాడి అమానుషమని పలువురు అడ్వకేట్లు అన్నారు. జనగామ ఘటనను నిరసిస్తూ తాండూరు కోర్టులో విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాంరెడ్డి, కె గోపాల్, రవికుమార్, సుదర్శన్, సోఫియాబేగం, శ్రావణ్, గుండప్ప, ఫరీద్, అరుణ, జిలానీ, కలాం తదితరులు నిరశన తెలిపిన వారిలో ఉన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న జయసుధ

జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ

**దోమ:** పుట్టినప్పటి నుంచి తల్లిపాలు ఇవ్వడంతో బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో ఐసీడీఎస్ సిబ్బంది నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం లాంటి పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. అనంతరం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో విధులను పరిశీలించారు. శానిటేషన్, ప్లాంటేషన్ తప్పనిసరిగా చేయాలని పంచాయతీ కార్యదర్శి రాముకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం, ఎంఈఓ హరిశ్చందర్, అంగన్వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎంఈఓలను నియమించాలి

- ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

**చేవెళ్ల:** ప్రభుత్వ పాఠశాలను పర్యవేక్షించే ఎంఈఓ పోస్టులను వెంటనే నియమించాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్కారు బడులను పర్యవేక్షణ చేసేందుకు 20 ఏళ్లుగా పూర్తిస్థాయిలో మండల విద్యాధికారులు(ఎంఈఓ) లేక విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంఈఓలను నియమించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అంతకుముందు సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, ఎన్నికల అధికారి సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకర్, కోశాధికారిగా ఎ.యాదిలాల్, ఉపాధ్యక్షుడిగా డి.ప్రభు, జాయింట్ కార్యదర్శిగా పి.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వీరన్న, మహిళ కార్యదర్శులుగా పి.సుజాత, ఎల్.నీరజ, ఎం.శైలజ, టి.సునీత, వై.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా శ్రీను ఉన్నారు. కార్యక్రమంలో రమణకుమార్, చంద్రశేకర్, రమేశ్, నర్సింహారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'విద్యారంగ సమస్యలపై పోరాటం'



మాట్లాడుతున్న శ్రీకాంత్

**షాద్‌నగర్:** విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీఏఎం కళాశాలలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముకిద్, జుబేర్, సాయి, విజయ్ పాల్గొన్నారు.

### రికవరీ సెల్‌ఫోన్ల అప్పగింత

**ధారూరు:** చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ బుధవారం తెలిపారు. గట్టెపల్లి గ్రామానికి చెందిన డి.రాజేందర్, చింతకుంటకు చెందిన పి.శ్రీనివాస్‌రెడ్డిల సెల్‌ఫోన్లు ధారూరులో ఇటీవల చోరీకి గురయ్యాయి. సీఈఐఆర్ పరిజ్ఞానంతో పోయిన సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

### పురుగు మందుల వాడకం తగ్గించాలి

**బంట్వారం:** పురుగు మందుల వాడకాన్ని రైతులు దాదాపుగా తగ్గించాలని కోట్‌పల్లి వ్యవసాయ అధికారి పండు రంగాచారి తెలిపారు. బుధవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని జిన్నారం తదితర గ్రామాల పంట పొలాలను సందర్శించి మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడకూడదన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయంపై కూడా రైతులు దృష్టి సారించాలన్నారు. పంటల సాగు విధానం, పురుగు మందుల పిచికారీపై ఏమైనా అనుమానాలు ఉంటే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధం

**పరిగి:** షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధమైన సంఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన ఎండీ సాదక్ తన ట్రాలీ ఆటోని పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీకి వెళ్లేదారిలో హనుమాన్ దేవాలయం పక్కన ఆపి పని నిమిత్తం బయటకి వెళ్లాడు. కొద్దిసేపటికి ఆటోలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న సాదక్ తోటి డ్రైవర్లు కలిసి నీటితో మంటలను ఆర్పేశారు. అప్పటికే ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు పరిశీలించి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

# బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర నాయకులు

- దివ్యాంగుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వాలు
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

**అనంతగిరి:** దివ్యాంగులకు బడ్జెట్ కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి అడివయ్య ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లో ఎన్‌పీఆర్‌డీ జిల్లా 2వ మహాసభను క్లబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి ప్రత్యేక నోటిఫికేషన్‌తో భర్తీ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో తమకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలన్నారు. స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటూ వడ్డీలేని సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. దివ్యాంగులపై జరుగుతున్న దాడులను ఆపాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని నిర్ణయించినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్‌ను ప్రతి నెలా 5 లోపు విధిగా అందించాలన్నారు. హామీ ప్రకారం ఆసరా పింఛనును పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్, కార్యదర్శి శంకర్, కోశాధికారి సావిత్రి, నాయకులు మారుతి, సత్యమ్మ, సలీం, నారాయణగౌడ్, ఆనంద్, అనంతలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లు లేక.. వైద్యం అందక



దౌల్తాబాద్, పీహెచ్‌సీ

- దౌల్తాబాద్ పీహెచ్‌సీలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- వైద్యులను నియమించాలని స్థానికుల విజ్ఞప్తి

**దౌల్తాబాద్:** ఆధునిక దేవాలయాలుగా పిలువబడే ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదల వైద్యం ప్రశ్నార్థకంగా మారింది. అన్ని సదుపాయలున్నా వైద్య సిబ్బంది లేక రోగులు అవస్థలు పడుతున్నారు. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది దౌల్తాబాద్ పీహెచ్‌సీ పరిస్థితి. పల్లెదవాఖానలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు సౌమ్య ప్రస్తుతం రోగులకు సేవలందిస్తున్నారు. తాత్కాలిక వైద్యులతో కాలం వెళ్లదీస్తున్న పీహెచ్‌సీలో ఉన్నత చదువులు, బదిలీలు తదితర కారణాలతో వేరే ప్రాంతాలకు సిబ్బంది వెళ్లారు. దీంతో ఇక్కడి పేదలు వైద్యానికి నోచుకోని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రికి వచ్చిన చాలా మంది ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

**వెంటనే నియమించాలి**



పీహెచ్‌సీలో ప్రస్తుతం డాక్టర్లు లేరు. పల్లె దవాఖాన వైద్యురాలు మాత్రమే పరీక్షిస్తుంది. దీంతో పేదలు సరైన వైద్యానికి నోచుకోవడం లేదు. ఇక్కడ ఉన్న వైద్యులు, సిబ్బంది కొంతమంది ఇటీవల బదిలీ అయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పోస్టులు భర్తీ చేయాలి.

– వెంకటప్ప, దౌల్తాబాద్

**వైద్యాధికారుల పోస్టులు ఖాళీ**

దౌల్తాబాద్ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాల్సింది. అయితే గత కొన్నేళ్లుగా ఒక పోస్టు ఖాళీ ఉంది. మరో పోస్టులో డిప్యూటేషన్‌పై సిద్దలూరు పీహెచ్‌సీ నుంచి వచ్చిన రతన్‌లాల్ విధులు నిర్వహించారు. ఇటీవల బదిలీల్లో ఆయన కూడా వెళ్లిపోయారు. అలాగే పీహెచ్ఎన్, స్టాఫ్‌నర్సు, రెండు సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఎనిమిది ఏఎన్ఎం పోస్టులు ఖాళీలున్నాయి. 9 పల్లె దవాఖానాల్లో ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. మిగిలిన వాటిలో ఏఎన్ఎంలతోనే సేవలందిస్తున్నారు. ఇలా పీహెచ్‌సీలో సిబ్బంది కొరతతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సరైన సేవలందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.